సాక్షి
తూర్పుగోదావరి

శనివారం । 4 । జనవరి । 2025



అందాలొలికిన ఆలమంద!

రాష్ట్ర స్థాయి ఆవుల పాల, ఎద్దుల అందాల పోటీలు శుక్రవారం మలికిపురం మండలం కేశనపల్లి ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ప్రారంభమయ్యాయి.


II లో



కోళ్లాహలం

ఆర్యావటం సంత మార్కెట్‌లో పందెం కోడి పుంజుల అమ్మకాలు జోరుగా సాగాయి. ప్రతి శుక్రవారం విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కన ఉన్న మార్కెట్‌లో కోళ్ల సంత జరుగుతుంది.

డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 12,810 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3,780, మధ్య డెల్టాకు 2,460, పశ్చిమ డెల్టాకు 6,570 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

హాస్టల్ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న శోభారాణి

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): నూతన సంవత్సర వేళ తనకు అభినందనలు తెలిపేందుకు వచ్చిన వారు అందజేసిన పుస్తకాలను ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు అందజేశామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన సంవత్సర వేళ శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చే వారు ఇచ్చే బొకేలు తాత్కాలిక ప్రయోజనం మాత్రమే చేకూరుస్తాయని, దీనికి బదులు సామాజిక సేవకు దోహదపడే కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుందని అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ పుస్తకాలను 322 సెట్లుగా హాస్టళ్ల విద్యార్థులకు అందజేశామని జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ఎంఎస్ శోభారాణి తెలిపారు.

6న జాబ్‌మేళా

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి సంస్థ ఆధ్వర్యాన రాజమహేంద్రవరంలోని మోడల్ కెరీర్ సెంటర్ ప్రాంగణంలో ఈ నెల 6న జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. జిల్లా ఉపాధి అధికారి హరీష్‌చంద్రప్రసాద్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పెరుమాళ్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. యాక్సిస్ బ్యాంక్, పీఎన్‌బీ మెట్‌లైఫ్, లక్ష్మీ హ్యుండాయ్ కంపెనీల్లో వివిధ ఉద్యోగాల భర్తీకి ఈ మేళా జరుగుతోందన్నారు. పదో తరగతి, ఐటీఐ, డిగ్రీ,, పీజీ పూర్తి చేసిన 19 నుంచి 35 సంవత్సరాల లోపు వారు అర్హులన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న వారు ముందుగా https://naipunyam.ap.gov.in/user&registration వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలతో నమోదు చేసుకోవాలని సూచించారు. జాబ్ మేళాకు ఆ రోజు ఉదయం 10 గంటలకు రెజ్యూమ్, ఆధార్, ఇతర సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలు తీసుకుని రావాలన్నారు. వివరాలకు 99888 53335, 87126 55686, 87901 18349, 87901 17279 నంబర్లలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల్లోపు సంప్రదించవచ్చునన్నారు.

నేటి నుంచి పక్షుల గణన

తాళ్లరేవు: అంతర్జాతీయ నీటి పక్షులను గుర్తించేందుకు శని, ఆదివారాలలో వాటి గణన నిర్వహించనున్నట్లు ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్ ప్రసాదరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అటవీశాఖ ఆధ్వర్యంలో జరుగనున్న ఈ గణనకు సంబంధించి బాంబే నేషనల్ హిస్టరీ సొసైటీ (బీఎన్‌హెచ్ఎస్) బర్డ్స్ వాటర్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, డెక్కన్ బర్డ్స్ హైదరాబాద్ తదితర సంస్థలతోపాటు కళాశాల విద్యార్థులు మొత్తం 60 మందికి పైగా పాల్గొంటారని తెలిపారు. దీనిలో భాగంగా 4వ తేదీన లెక్కింపు ఎలా చేయాలనే అంశంపై కోరంగి బయోడైవర్సిటీ సెంటర్‌లో అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. అభయారణ్యం పరిధిలోని 12 పక్షి ఆవాస ప్రాంతాల్లో బృందానికి ఐదుగురు చొప్పున నీటిపక్షుల గణన చేపడతారని ప్రసాదరావు తెలిపారు.

ఫిషింగ్ బోట్లలో తనిఖీలు

ఏడు ఆలివ్ రిడ్లే తాబేళ్లు సముద్రంలో విడుదల



హోప్ ఐలాండ్ ప్రాంతంలో సముద్రంలోకి ఆలివ్ రిడ్లే తాబేళ్లను వదులుతున్న దృశ్యం

తాళ్లరేవు: కాకినాడ జిల్లా పరిధిలోని ఎన్టీఆర్, ఉప్పాడ బీచ్‌లలో ఆలివ్ రిడ్లే తాబేళ్లు మృతిచెందుతున్నాయన్న వార్తల నేపథ్యంలో శుక్రవారం ఫారెస్ట్ అధికారుల బృందం తనిఖీలు నిర్వహించింది. ఫారెస్ట్ రేంజర్ ప్రసాదరావు ఆధ్వర్యంలో కోరంగి పంచాయతీ హోప్ ఐలాండ్ ప్రాంతంలో నిర్వహించిన ఈ తనిఖీలలో భాగంగా రెండు ఫిషింగ్ బోట్లలో తనిఖీ చేయగా ఒక బోటులో నాలుగు, మరో బోటులో మూడు తాబేళ్లు జీవించి ఉన్నట్లు గుర్తించామన్నారు. వలలను కత్తిరించి తాబేళ్లను సముద్రంలో వదిలివేసి బోట్లను స్వాధీన పరచుకున్నట్లు ప్రసాదరావు తెలిపారు. ఇకపై హోప్ ఐలాండ్ ప్రాంతంలో 5 కిలోమీటర్ల దూరం దాటి ఫిషింగ్ చేసుకోవాలని లేకుంటే వారిపై వైల్డ్‌లైఫ్, ఫిషరీస్ చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

ఇంకెన్నాళ్లీ సెస్‌బిషలు!

- రూ.47 కోట్లు పైగా బకాయిలు చెల్లించని స్థానిక సంస్థలు
- నగరపాలక సంస్థలు, పంచాయతీలదే అధిక వాటా
- ఉమ్మడి జిల్లాలో 102 గ్రంథాలయాలు
- అభివృద్ధికి శాపంలా మారిన బకాయిలు
- వెంటనే చెల్లించాలని విన్నపాలు



కాకినాడలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న పాఠకులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: విజయవాడలో 35వ పుస్తక మహోత్సవాన్ని ప్రభుత్వం ఆర్భాటంగా నిర్వహిస్తున్న వేళ.. రాష్ట్రవ్యాప్తంగానే గ్రామీణ గ్రంథాలయాలకు ఊపిరి పోయాలని.. వీటికి పూర్వ వైభవం తీసుకు వచ్చే దిశగా అడుగులు వేయాలని పాఠకులు డిమాండ్ చేస్తున్నారు. డిజిటలైజేషన్ కొత్త పుంతలు తొక్కుతున్న ప్రస్తుత తరుణంలో సైతం గ్రంథాలయాలకు మాత్రం ఎక్కడా ఆదరణ తగ్గడం లేదు. వీటికి వస్తున్న పాఠకుల సంఖ్య కూడా క్రమంగా పెరుగుతూనే ఉంది. ఈ పరిస్థితుల్లో గ్రంథాలయాల్లో వసతులు మెరుగు పరచాలని పాఠకులు కోరుతూనే ఉన్నారు. స్థానిక సంస్థలు సెస్ బకాయిలు చెల్లిస్తేనే ఇది సాధ్యమవుతుంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాపంగా ఉన్న వివిధ స్థాయిల్లోని 102 గ్రంథాలయాలకు ప్రతి రోజూ 25 వేల నుంచి 30 వేల మంది పాఠకులు వస్తూంటారని అంచనా. గతంలో కంటే గ్రంథాలయాలకు వస్తున్న వారి సంఖ్యలో ఏడెనిమిది శాతం పెరుగుదల కనిపిస్తోంది.

ఏళ్ల తరబడి బకాయిలు

గ్రంథాలయాల నిర్వహణకు ప్రధాన వనరు స్థానిక సంస్థలు చెల్లించాల్సిన సెస్. ప్రజల నుంచి ముక్కుపిండి మరీ స్థానిక సంస్థలు పన్నులు వసూలు చేస్తున్నా.. అందులోని వాటా మాత్రం ఏళ్ల తరబడి గ్రంథాలయాల ఖాతాలకు చేరడం లేదు. గ్రంథాలయాల సెస్‌ను స్థానిక సంస్థలే దర్జాగా వాడేసుకుంటున్నాయి. ఈ విధంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా స్థానిక సంస్థల నుంచి వసూలైన గ్రంథాలయ సెస్ రూ.47,13,87,848 కోట్ల మేర ఆయా స్థానిక సంస్థల వద్ద పెండింగ్‌లో ఉండిపోయింది. దీనిపై జిల్లా అధికారులను అడుగుతూంటే స్థానిక సంస్థల అధికారులతో నిర్వహిస్తున్న సమీక్షా సమావేశాల్లో పదేపదే చెబుతున్నామంటున్నారే తప్ప.. ఆయా సంస్థలు చిల్లిగవ్వ కూడా బదలాయించిన దాఖలాలు కనిపించడం లేదు. 2007–08 నుంచి పెండింగ్‌లో ఉన్న కోట్లాది రూపాయల సెస్ బకాయిలు రాబట్టేందుకు చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కనుచూపు మేరలో కూడా కనిపించడం లేదు. ఈ పరిస్థితి గ్రంథాలయాల పూర్వ వైభవానికి పెద్ద ప్రతిబంధకంగా పరిణమించింది.

ఒకప్పుడు 51.. నేడు 5

ఒకప్పుడు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 51 గ్రామీణ గ్రంథాలయాలు ఉండేవి. వీటి నిర్వాహకులకు ప్రతి నెలా అప్పట్లో రూ.15 వేల నుంచి రూ.18 వేల వరకూ వేతనం చెల్లించేవారు. వీటిల్లో పని చేసిన ఉద్యోగులు ఉద్యోగ విరమణ చేయడంతో ఆ పోస్టులను తిరిగి భర్తీ చేయలేదు. ఫలితంగా 46 గ్రామీణ గ్రంథాలయాలు మూతపడ్డాయి. ప్రస్తుతం ఎ.మల్లవరం కట్టమూరు, ఉప్పలగుప్తం, తాటిపర్తి, సాకుర్రుల్లో మాత్రమే నడుస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో గ్రామీణ గ్రంథాలయాల స్థానంలో గౌరవ వేతనంపై నిర్వహించే బుక్ డిపాజిట్ సెంటర్లు (బీడీసీ – పుస్తక నిక్షిప్త కేంద్రం) ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అవే కొనసాగుతున్నాయి. అలానే రాజమహేంద్రవరం, కాకినాడ నగరాలతో పాటు పలు పట్టణాల్లో రిక్షాలపై పుస్తకాలు పెట్టి చదివించే మొబైల్ లైబ్రరీలు ఉండేవి. కాలక్రమేణా అవి కూడా కనుమరుగయ్యాయి.

గ్రంథాలయాలకు కొత్త పుస్తకాలు అవసరమని గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిపాదనలు పంపినా నిధులు లేవనే సాకుతో గాలికొదిలేశారు. ఈ పరిస్థితుల్లో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముందుకు వచ్చి 2022లో రూ.1.20 కోట్ల వ్యయంతో పాఠకులు ఎంతో కాలంగా అభ్యర్థిస్తున్న సుమారు 80 వేల పుస్తకాలు కొనుగోలు చేసి, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని గ్రంథాలయాలకు సమకూర్చింది.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో గ్రంథాలయాల వివరాలు

జిల్లా కేంద్ర గ్రంథాలయం	కాకినాడ
గ్రేడ్–1 శాఖా గ్రంథాలయాలు	5
గ్రేడ్–2 శాఖా గ్రంథాలయాలు	10
గ్రేడ్–3 శాఖా గ్రంథాలయాలు	86
మొత్తం	102
గ్రంథాలయాల్లో సభ్యులు	38,500

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 2007-08 నుంచి 2023-24 వరకూ స్థానిక సంస్థలు చెల్లించాల్సిన సెస్ బకాయిలు (రూ.)

రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ	19,03,03,000.00
కాకినాడ నగర పాలక సంస్థ	9,66,35,752.00
మున్సిపాలిటీలు	2,38,47,626.00
గ్రామ పంచాయతీలు	16,06,01,470.00



కాకినాడలోని జిల్లా కేంద్ర గ్రంథాలయం

సెస్ చెల్లించి చేయూతనివ్వాలి



స్థానిక సంస్థలు వెంటనే సెస్ బకాయిలు చెల్లించి గ్రంథాలయాల అభివృద్ధికి చేయూతనివ్వాలి. ఇటీవల పాఠకుల సంఖ్య పెరగడంతో అభివృద్ధికి నిధుల అవసరం ఉంది. ముఖ్యంగా కార్పొరేషన్ల నుంచి ఎక్కువగా బకాయిలు పేరుకుపోయాయి. జిల్లా యంత్రాంగాలు చొరవ తీసుకుని బకాయిలు జమ అయ్యేలా చూడాలి.

– వీఎల్ఎన్ఎస్‌వీ ప్రసాద్, కార్యదర్శి, జిల్లా గ్రంథాలయ సంస్థ, కాకినాడ

పాఠకులకు అందుబాటులో ఉండాలి



ప్రజల విజ్ఞానాన్ని పెంచడానికి ఏర్పాటు చేసిన గ్రంథాలయాలు ప్రజలకు అందుబాటులో ఉండాలి. సామర్లకోటలోని గ్రంథాలయం అద్దె భవనంలో రెండో అంతస్తులో ఉండటంతో 40 మెట్లు ఎక్కి వెళ్లాల్సి వస్తోంది. దీంతో, వృద్ధులు, దివ్యాంగులు, గ్రంథాలయానికి దూరమవుతున్నారు. విజ్ఞానాన్ని మరింతగా పెంచేలా గ్రంథాలయంలో పుస్తకాల సంఖ్య పెరగాలి.

– జి.రాజు, గ్రంథాలయ పాఠకుడు, సామర్లకోట

పన్ను ఆలస్యమైతే వడ్డీ చెల్లించాల్సిందే

- మున్సిపల్ ఆర్‌డీ నాగనరసింహారావు
- వివిధ అంశాలపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న నాగనరసింహారావు

కొవ్వూరు: పట్టణాల్లోని ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించకపోతే వడ్డీ మాఫీ ఉండదనే విషయాన్ని మున్సిపల్ మంత్రి స్పష్టం చేశారని, ప్రతి నెలా 2 శాతం వడ్డీ పెరుగుతుందనే విషయాన్ని గుర్తించాలని మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ (ఆర్‌డీ) సీహెచ్ నాగనరసింహారావు అన్నారు. తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాల పరిధిలోని ఆరు మున్సిపాలిటీల అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల కారణంగా పట్టణాల్లో గోతులు లేని రోడ్ల నిర్మాణం కొంత జాప్యమైందని, ఈ నెలాఖరుకు గుంతల్లేని రోడ్ల తయారీకి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆదాయ పన్ను, నీటి పన్ను, ట్రేడ్ లైసెన్స్‌ల వసూళ్ల వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. మున్సిపాలిటీల వారీగా పన్ను వసూళ్లపై సమీక్షించారు. పన్ను వసూళ్లలో వెనుకబడిన అమలాపురం, రామచంద్రపురం మున్సిపల్ అధికారులకు అక్షింతలు వేశారు. మార్చి నెలాఖరుకు నిర్దేశిత లక్ష్యాలు సాధించేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేశారు. తడి, పొడి చెత్త వేరు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పారిశుధ్యం, వీధిలైట్ల నిర్వహణ, తాగునీటి సరఫరా, అక్రమ కుళాయి కనెక్షన్ల గుర్తింపు, నోటీసుల జారీ తదితర విషయాలపై సమీక్షించారు. సచివాలయ సిబ్బంది ఉదయం పూట విధులకు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. ఔరంగబాద్, క్రిస్టియన్‌పేట, ఆవులవారి వీధి, శ్రీరామ కాలనీ సచివాలయ సిబ్బంది పనితీరు మెరుగుపరచుకోవాలన్నారు. అమలాపురం, రామచంద్రపురం, మండపేట, ముమ్మిడివరం, నిడదవోలు మున్సిపాలిటీల్లో నాలుగేసి సచివాయాల పనితీరు బాగోలేదన్నారు. కాకినాడ – రాజమహేంద్రవరం మధ్య గుంటూరులో మాదిరిగా జిందాల్ పవర్ సంస్థ ద్వారా సాలిడ్ వేస్ట్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ ప్లాంటు నిర్మించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని చెప్పారు. లేఅవుట్లు, భవన నిర్మాణాల అనుమతులు, నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవడంపై మున్సిపాలిటీల వారీగా సమీక్షించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు టి.నాగేంద్ర కుమార్, రెండు జిల్లాల పరిధిలోని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, టౌన్‌ప్లానింగ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

రేపటి నుంచి యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (ఏపీ యూటీఎఫ్) స్వర్ణోత్సవ మహాసభలు కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జరగనున్నాయని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలో సమానత్వ భావనను ప్రోది చేసే ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి, పరిరక్షణకు, ఉపాధ్యాయుల సంక్షేమానికి గత 50 ఏళ్లుగా యూటీఎఫ్ ఎంతో కృషి చేసిందని చెప్పారు. మా ధర్మం గొప్పదంటే మా ధర్మం గొప్పదనే చర్చలు నడుస్తున్న ప్రస్తుత కాలంలో ఏ ధర్మాన్ని పాటించాలో ఉపాధ్యాయులు తేల్చుకోవాలన్నారు. రాజ్యాంగ ధర్మాన్ని పాటించాలని, సమానత్వాన్ని, లౌకికత్వాన్ని విద్యార్థులకు నేర్పాలని కోరారు. ప్రభుత్వ విద్యారంగాన్ని, భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడం నినాదంగా ఈ మహాసభలు జరుగుతున్నాయని తెలిపారు. యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శులు రెడ్డి మోహనరావు, ఎన్.అరుణకుమారి, ఎస్.కిషోర్ కుమార్, టి.అన్నారాం మాట్లాడుతూ, నూతన ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు పూర్తవుతోందని, 12వ పీఆర్‌సీని ఇంతవరకూ నియమించలేదని అన్నారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభల్లో వివిధ రాజకీయ నేతలు విద్యారంగంపై వారి అభిప్రాయాలు తెలియజేస్తారని చెప్పారు.

పరిమతి లేకుండా..

- ఇసుక తవ్వకాల్లో నిబంధనలకు తిలోదకాలు
- ప్రభుత్వం నిర్దేశించిన పరిమితికి మించి అక్రమ తవ్వకాలు
- పెండ్యాల, తీపర్రు, కోటిలింగాల ర్యాంపుల్లో దందా
- ప్రతి రోజూ 500 పైగా లారీల్లో రవాణా



కానూరు ర్యాంప్‌లో పరిమితికి మించి సాగుతున్న తవ్వకాలు



ట్రాక్టర్లపై ఇసుక ఎగుమతి చేస్తున్న కూలీలు

సాక్షి, రాజమహేంద్రవరం: ఇసుకాసురులు బరి తెగిస్తున్నారు. గోదావరి నదిని గుల్ల చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లఘించి మరీ అడ్డగోలు వ్యవహారానికి తెర తీస్తున్నారు. ర్యాంపుల్లో ఇసుక తవ్వకాలకు పరిమితులు ముగిసినా లెక్క చేయకుండా యథేచ్ఛగా తవ్వకాలు సాగిస్తున్నారు. వందల లారీల ఇసుక అక్రమంగా తరలించి రూ.లక్షలు దండుకుంటున్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని కోటిలింగాలు, పెరవలి మండలం కానూరు – పెండ్యాల, తీపర్రు ర్యాంపుల్లో ఇసుక దందా మూడు ట్రాక్టర్లు –ఆరు లారీలు అన్న చందంగా సాగుతోంది. ఇదంతా తెలిసినా మైనింగ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఇదీ సంగతి

జిల్లా వ్యాప్తంగా ఉన్న ర్యాంపుల్లో ఇసుక తవ్వకాల బాధ్యతలను బోట్స్‌మెన్ సొసైటీలకు అప్పగించారు. సొసైటీ సభ్యులు ఇసుక తవ్వి ఒడ్డుకు చేరిస్తే.. దాన్ని ప్రజల అవసరాలకు సరఫరా చేస్తారు. దీనికి గాను జిల్లా అధికారులతో కూడిన జిల్లా స్థాయి శాండ్ అడ్వైజరీ కమిటీ (డీఎల్ఎస్ఏ) ఆయా ర్యాంపుల్లో ఏ మేరకు తవ్వకాలు జరపాలి, ఎంత ఇసుక విక్రయించాలనేది నిర్ణయిస్తుంది. అందుకు అనుగుణంగా ఆన్‌లైన్‌లో లక్ష్యం నిర్దేశిస్తుంది. కమిటీ నిర్ధారించిన లక్ష్యం పూర్తయిన వెంటనే తిరిగి తవ్వకాలు జరపాలంటే సదరు కమిటీ అనుమతులు పొందాల్సి ఉంది. జిల్లాలోని కొన్ని ర్యాంపుల్లో ఈ నిబంధనలకు నీళ్లొదిలారు. బోట్స్‌మెన్ సొసైటీల ముసుగులో ఇసుక మాఫియా రంగంలోకి దిగింది. ప్రభుత్వం నిర్దేశించిన తవ్వకాల పరిమితులు పూర్తయినా తమకేమీ పట్టనట్లు అక్రమ తవ్వకాలకు తెగబడుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలను తుంగలో తొక్కి మరీ రాత్రుళ్లు యథేచ్ఛగా డ్రెడ్జింగ్ చేపట్టి వందల లారీల్లో ఇసుకను జిల్లా దాటించేస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆ ర్యాంపులో అక్రమ దందా

కానూరు–పెండ్యాల ర్యాంపుల్లో అక్రమ దందా కొనసాగుతోంది. ర్యాంపులో 74,000 క్యూబిక్ మీటర్ల ఇసుక తవ్వకాలకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. ఇప్పటికే పరిమితికి మించి ఒకటిన్నర కిలోమీటర్ల వరకూ తవ్వకాలు చేపట్టారు. ప్రభుత్వం నిర్దేశించిన పరిమితి ముగిసి మూడు రోజులవుతున్నా తవ్వకాలు మాత్రం ఇంకా ఆగడం లేదు. ప్రతి రోజూ ర్యాంప్ నుంచి 300 లారీల ఇసుక తరలిపోతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కానీ అధికారులు మాత్రం 6,000 క్యూబిక్ మీటర్ల తవ్వకాలే జరిగాయని చెబుతున్నారు. ఇదే అదునుగా భావించిన ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. ఒకే పర్మిట్‌పై పదుల సంఖ్యలో లారీల్లో ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించేస్తున్నారు. అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ పట్టించుకోవడం లేదు. ఇలా ప్రతి రోజూ 300కు పైగా లారీలు తరలుతున్నా 120 మాత్రమే వెళుతున్నాయని చెబుతున్నారు. దీని వెనుక రూ.లక్షలు చేతులు మారుతున్నట్లు తెలుస్తోంది.

కోటిలింగాలలో కొల్లగొట్టుడు

రాజమహేంద్రవరం అర్బన్‌లోని కోటిలింగాల రేవు వద్ద రీచ్‌ను 12 భాగాలుగా విభజించి తవ్వకాలు సాగిస్తున్నారు. ఈ రీచ్‌లో సైతం ప్రభుత్వం అనుమతించిన 80,000 క్యూబిక్ మీటర్ల ఇసుకను రెండు రోజుల క్రితమే తవ్వి తరలించేశారు. ఇకపై తవ్వకాలు చేపట్టాలంటే మళ్లీ అనుమతులు పొందాలి. కానీ, అవేమీ లేకుండానే యథేచ్ఛగా డ్రెడ్జింగ్ చేసి, ఇసుక కొల్లగొడుతున్నారు.

సైన్స్ సంబరానికి వేళాయె..


- నేడు జిల్లా స్థాయి దక్షిణ భారత విద్యా వైజ్ఞానిక ప్రదర్శన
- శ్రీ సత్యసాయి గురుకులంలో పూర్తయిన ఏర్పాట్లు
- 89 ప్రాజెక్టుల ప్రదర్శన
- ఉత్తమ ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపిక



జిల్లా స్థాయి పోటీలు జరగనున్న శ్రీ సత్యసాయి గురుకులం

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా స్థాయి దక్షిణ భారత విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు రంగం సిద్ధమైంది. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను గుర్తించి, ప్రోత్సహించే లక్ష్యంతో స్థానిక శ్రీ సత్యసాయి గురుకులంలో శనివారం కార్యక్రమం నిర్వహించనున్నారు. జిల్లాలోని 217 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 8, 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులందరూ సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనకు అర్హులు. గత నెల 31న నిర్వహించిన మండల స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన 57 ప్రాజెక్టులు జిల్లా స్థాయికి నేరుగా అర్హత సాధించాయి. మండల స్థాయి విజేతలుగా నిలిచిన విద్యార్థి వ్యక్తిగత విభాగంలో 19, విద్యార్థుల బృంద విభాగంలో 19, టీచర్ విభాగంలో 19 ప్రదర్శనలను జిల్లా పోటీలకు ఎంపిక చేశారు. వీటితో పాటు ఒక్కో అటల్ టింకరింగ్ ల్యాబ్ పాఠశాల నుంచి ఒక్కొక్కటి చొప్పున 32 ప్రాజెక్టులు కూడా ఎంపికయ్యాయి. జిల్లా స్థాయి విజేతలుగా నిలిచిన ప్రాజెక్టులను ఈ నెల 6, 7 తేదీల్లో అమరావతిలో జరిగే రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపిక చేస్తారు. సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనకు జిల్లా నోడల్ అధికారిగా జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ఎస్ నెహ్రూను నియమించారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, ఎర్త్/స్పేస్ సైన్స్, ఎన్విరాన్‌మెంట్, ఇంజినీరింగ్, బయోసైన్స్/బయోకెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ అనే ఉప అంశాలపై మండల స్థాయి పోటీల్లో ప్రాజెక్టులను ప్రదర్శించారు. జిల్లా స్థాయి పోటీలను జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు పర్యవేక్షణలో నిర్వహించనున్నారు. జిల్లా స్థాయి సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనలకు విద్యార్థులను ఉపాధ్యాయులు పూర్తి స్థాయిలో సన్నద్ధం చేయాలని ఇప్పటికే సూచించారు. జ్యూరీ కమిటీకి ప్రాజెక్టు గురించి వివరించగలిగేలా తీర్చిదిద్దాలి. థర్మకోల్‌తో తయారు చేసిన నమూనాలను ప్రదర్శనలకు అనుమతించరు.


విజయవంతం చేయాలి



పాఠశాల విద్యాశాఖ, ఎస్‌సీఈఆర్‌టీ ఆదేశాల మేరకు ఈ విద్యా సంవత్సరానికి గాను జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నేడు జరుగుతుంది. హెచ్‌ఎంలు, ముఖ్యంగా సైన్స్ ఉపాధ్యాయులు ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలి. సైన్స్ ఎగ్జిబిషన్‌ను విజయవంతం చేయాలి.

– కె.వాసుదేవరావు, జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి, రాజమహేంద్రవరం

సృజనాత్మకతను వెలికితీసేందుకే..



విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకే మండల స్థాయి పోటీలు నిర్వహించి, జిల్లా స్థాయికి ఎంపిక చేశాం. శాస్త్రీయ దృక్పథం, సామాజికంగా ప్రయోజనకరంగా ఉండే ప్రాజెక్టులను ఎంపిక చేశాం. జిల్లాలోని 19 మండలాల నుంచి 57, అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల నుంచి 32 చొప్పున ప్రాజెక్టులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యాయి.

– జీవీఎస్ఎస్ నెహ్రూ, జిల్లా సైన్స్ అధికారి, రాజమహేంద్రవరం

పలువురికి కారుణ్య నియామకాలు



కారుణ్య నియామక ఉత్తర్వులు అందిస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): జిల్లా పరిషత్ పరిధిలోని వివిధ పాఠశాలల్లో పని చేస్తూ మరణించిన ఉద్యోగుల వారసులకు జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, సీఈఓ వీవీఎస్ లక్ష్మణరావు శుక్రవారం కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేశారు. ఇటీవలి కాలంలో ఏడుగురు మరణించగా వారి వారసులను జూనియర్ అసిస్టెంట్లుగా నియమించారు. ఇద్దరు రికార్డ్ అసిస్టెంట్లకు జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పిస్తూ నియామక ఉత్తర్వులు కూడా అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ విప్పర్తి మాట్లాడుతూ, ఖాళీలు ఏర్పడగానే ఎప్పటికప్పుడు నిబంధనల మేరకు కారుణ్య నియామకాలు చేపడుతున్నామని అన్నారు. ఉద్యోగుల పదోన్నతులకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొత్తగా నియామక ఉత్తర్వులు అందుకున్న ఉద్యోగులు కష్టపడి పని చేసి, మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు.


పోటీలలో పాల్గొన్న గిర్ ఆవులు


ప్రదర్శన ప్రారంభించి పుంగనూరు దూడను ఎత్తుకున్న ఎమ్మెల్యే వరప్రసాద్

అందాలొలికిన
ఆలమంద!


పాల పోటీలకు వచ్చిన ఒంగోలు ఆవులతో దూడలు


ఆకర్షణగా నిలిచిన కాంక్రీ జాతి ఆవు


అందాల పోటీలకు తాను సై.. అంటూ భీమవరం నుంచి వచ్చిన రెండడుగుల ఎత్తున్న జింగ్ బాంటమ్ జాతి గొర్రె


అందాల పోటీలకు వచ్చిన పుంగనూరు గిత్త

- ఆవుల పాల, ఎద్దుల అందాల పోటీలు ప్రారంభం
- కేశనపల్లిలో గో సమ్మేళన్ పేరుతో మూడురోజుల పాటు నిర్వహణ
- కోస్తా జిల్లాల నుంచి తరలివచ్చిన పలు జాతులు

మలికిపురం: రాష్ట్ర స్థాయి ఆవుల పాల, ఎద్దుల అందాల పోటీలు శుక్రవారం మలికిపురం మండలం కేశనపల్లి ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ప్రారంభం అయ్యాయి. గ్రామానికి చెందిన అడబాల లక్ష్మీ నారాయణ (నాని) ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. పోటీలలో పాల్గొనేందుకు కోస్తా జిల్లాల నుంచి తరలివచ్చిన పలు రకాల జాతుల ఎద్దులు, ఆవులతో క్రీడా ప్రాంగణం కళకళలాడుతోంది. గో సమ్మేళన్ పేరుతో మూడురోజుల పాటు పోటీలు జరగనున్నాయి. ఆవుల పాల ఉత్పత్తి పోటీలతో పాటు ఎద్దుల అందాల పోటీలు ఇక్కడ జరుగుతున్నాయి. ప్రఖ్యాత ఒంగోలు జాతితో పాటు పుంగనూరు, గిర్, కాంక్రీ వంటి జాతుల ఆవులు, గిత్తలు, గుర్రాలు, పొట్టేళ్లు కూడా ఇక్కడికి చేరకున్నాయి.

అంబేడ్కర్ కోనసీమ జిల్లాతో పాటు పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, విశాఖపట్నం, అనకాపల్లి, నెల్లూరు, ఎన్టీఆర్, గుంటూరు, ప్రకాశం, బాపట్ల, చిత్తూరు తిరుపతి తదితర జిల్లాలకు చెందిన అనేకమంది రైతులు, తమ ఆవులను, గిత్తలను పోటీలకు తీసుకుని హాజరయ్యారు. ప్రదర్శనలను రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఏపీ మార్క్ ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, నీటి సంఘాల అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్, పినిశెట్టి బుజ్జి, ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, సర్పంచ్‌లు యెనుముల నాగు, గుర్లింక సత్తిబాబు, మందపాటి నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు రాపాక సత్యనారాయణ, దిరిశాల బాలాజీ, ముప్పర్తి నాని, అడబాల సాయిబాబు పాల్గొన్నారు.


పందెం పుంజును పట్టుకుని కొనుగోలుదారుడి కోసం ఎదురు చూస్తున్న యువకుడు

కోళ్లాహలం


సంతలో అమ్మకానికి తీసుకువచ్చిన పందెం పుంజులు


పందెం పుంజుల అమ్మకాలతో సందడిగా మారిన ఆర్యావటం కోళ్ల సంత

ఆర్యావటంలో జోరుగా పందెం కోళ్ల అమ్మకాలు

కాజులూరు: మండలంలోని ఆర్యావటం సంత మార్కెట్‌లో పందెం కోడిపుంజుల అమ్మకాలు జోరుగా సాగాయి. ప్రతీ శుక్రవారం గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కన ఉన్న మార్కెట్‌లో కోళ్ల సంత జరుగుతుంది. పరిసర గ్రామాలలోని మహిళలు, రైతులు నాటుకోళ్లను తీసుకువచ్చి ఇక్కడ అమ్మకాలు నిర్వహిస్తుంటారు. కాకినాడ, రామచంద్రపురం, యానం తదితర పట్టణాల నుంచి పలువురు వ్యాపారులు వీటిని కొనుగోలు చేసి వారి ప్రాంతాలకు తీసుకువెళ్లి అక్కడ మళ్లీ మారు విక్రయాలు చేస్తుంటారు. ప్రతీ వారం ఇది పరిపాటిగా జరిగేదే. అయితే సంక్రాతి దగ్గర పడటంతో రెండు, మూడు వారాలుగా కోళ్ల సంతలో పందెం పుంజుల వ్యాపారం జోరుగా సాగుతోంది. సంక్రాంతి వచ్చిందంటే నియోజకవర్గ గ్రామాలలో కోడి పందేలు సాగుతుంటాయి. దీంతో పందెం పుంజులకు మంచి గిరాకీ ఉండటంతో జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతమైన ఏలేశ్వరం, రంపచోడవరం, పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డిగూడెం, ఖమ్మం తదితర ప్రాంతాల నుంచి పలువురు పందెం పుంజులను తీసుకువచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారు.

ఎర్రకోడి, కాకి, నెమలి, డేగ, పూల పచ్చకాకి వంటి జాతుల కోళ్లను ఈ శుక్రవారం సంతలో విక్రయించారు. జాతులను బట్టి ధర రూ.20 వేల నుంచి రూ.లక్ష వరకూ అమ్మకాలు జరిగినట్టు స్థానికులు చెబుతున్నారు. కోడిపందేల నిర్వహణకు అనుమతి లేకపోయినప్పటికీ కోళ్లకు కత్తులు కట్టనంతవరకూ కేసుల నమోదుకు అవకాశం లేకపోవటంతో పందెం పుంజులు విక్రయించినా పోలీసులు కేసులు పెట్టలేకపోతున్నారు. ఇక్కడ కోళ్ల సంత నిర్వహణకు అనుమతులు ఉండటంతో కోళ్ల సంత మాటున పందెం పుంజుల వ్యాపారం సాగుతోంది.

యూరియా కోసం రైతుల పాట్లు


పెద్దేవంలో యూరియా కోసం రైతుల పడిగాపులు

తాళ్లపూడి: యూరియా కోసం రైతులు ఎగబడాల్సిన ఇబ్బందికర పరిస్థితి తాళ్లపూడి మండలంలో ఏర్పడింది. రబీ సాగుకు అవసరమైన యూరియాను పొందలేక పోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మలకల్లి సొసైటీ పరిధిలోని పెద్దేవంలోని సొసైటీ గోడౌన్ వద్దకు యూరియా లారీ వచ్చిందన్న సమాచారం అందడంతో మండలంలోని పెద్దేవం, బల్లిపాడు, వేగేశ్వరపురం, తిరుగుడుమెట్ట గ్రామాల నుంచి అధిక సంఖ్యలో రైతులు చేరుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ గతంలో సొసైటీలలో యూరియా అవసరమైన మేర సరఫరా జరిగేదని, ప్రస్తుతం కృత్రిమ కొరత సృష్టించి, రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.270 ఉన్న యూరియా బస్తాను బయట మార్కెట్‌లో రూ.300కు పైగా విక్రయిస్తున్నారని తెలిపారు. ఐదు బస్తాల కంటే ఎక్కువ ఇచ్చేది లేదని ఆంక్షలు పెడుతున్నారని రైతులు చెప్పారు. దీనిపై ఏవో రుచిత మాట్లాడుతూ నాలుగు రోజులుగా 180 టన్నుల యూరియా వచ్చిందని, రైతులు అందరూ ఒకేసారి కొంటున్నందున ఇబ్బంది ఏర్పడిందని తెలిపారు. దఫ దఫాలుగా వస్తుందని ఆందోళన అవసరం లేదని చెప్పారు.

మండపేటలో కూటమి నేతల బరి తెగింపు

సాక్షి టాస్క్‌ఫోర్స్: మండపేటలో కూటమి నేతలు బరి తెగించారు. కొత్త సంవత్సరం ప్రారంభం సందర్భంగా పట్టణంలోని ఓ లేఅవుట్‌లో అశ్లీల నృత్యాలతో వేడుకలు చేసుకున్నారు. మహిళలను వివస్త్రలను చేసి మద్యం సేవిస్తూ జనసేన, టీడీపీ నాయకులు వారితో చిందులేశారు. వీటికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుండటం జిల్లాలో సంచలనంగా మారింది. నూతన సంవత్సర వేడుకల కోసం మండపేట, కపిలేశ్వరపురం మండలాలకు చెందిన కొంతమంది జనసేన నాయకులు భారీ లైటింగ్, సౌండ్ సిస్టమ్‌తో అశ్లీల నృత్యాలను ఏర్పాటు చేసుకున్నారు. ఇందుకోసం రాజమహేంద్రవరం నుంచి ఆరుగురు హిజ్రాలు, మహిళలను తీసుకువచ్చినట్టు తెలుస్తోంది. డీజే సాంగ్స్, విద్యుత్ వెలుగుల్లో మద్యం సేవిస్తూ వారితో నృత్యాలు చేయించారు. మొదట అర్ధ నగ్నంగా, తర్వాత పూర్తి వివస్త్రలుగా మహిళలు నృత్యాలు చేయడం వారితో కలిసి కూటమి నాయకులు చిందులు వేయడం వీడియోల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ వీడియోలు ఫేస్‌బుక్, వాట్సాప్ గ్రూపుల్లో హల్‌చల్ చేస్తున్నాయి. 50 మందికి పైగానే జనసేన, టీడీపీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్టు తెలుస్తోంది. అసాంఘిక కార్యకలాపాలతో ఇంత భారీ ఎత్తున వేడుకలు ఏర్పాటు చేసుకున్నా పట్టణంలోని పోలీసుల దృష్టికి రాకపోవడం గమనార్హం. ఇక్కడి నిఘా వ్యవస్థ పనితీరుకు వేడుకలు అద్దం పడుతున్నాయని స్థానికులు అంటున్నారు.

అశ్లీల నృత్యాలపై కేసు నమోదు

మండపేటలోని ఓ లేఅవుట్లో జరిగిన అశ్లీల నృత్యాల ఘటనపై పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. టౌన్ స్టేషన్లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రూరల్ సీఐ పీ దొరరాజు నిందితుల వివరాలు వెల్లడించారు. పట్టణంలో 31వ తేదీ రాత్రి నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా స్థానిక లేఅవుట్లో కొంతమంది వ్యక్తులు వేడుకలు నిర్వహించుకున్నారన్నారు. అందులో భాగంగా ఇద్దరు ట్రాన్స్ జెండర్లను తీసుకొచ్చి అశ్లీల నృత్యాలు చేయించారని చెప్పారు. వీడియో ఆధారంగా 13 మందిపై ఎస్ఐ హరికోటి శాస్త్రి కేసు నమోదు చేసినట్టు తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. వీడియోల ఆధారంగా మరి కొంతమందిని గుర్తించి అదుపులోకి తీసుకుంటామని సీఐ దొరరాజు వివరించారు.

సమాజం సిగ్గు పడేలా రేవ్ పార్టీలు : ఎమ్మెల్సీ తోట

మండపేటలో డిసెంబర్ 31న రేవ్ పార్టీ నిర్వహించిన కూటమి కార్యకర్తల వైఖరి సమాజం సిగ్గు పడేలా ఉందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మండిపడ్డారు. శుక్రవారం ఆయన మండపేటలో మీడియాతో మాట్లాడుతూ ఈ విషయమై అధికార పార్టీ నాయకులు సమాధానం చెప్పాలన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారి రాంబాబుపై కేసు పెట్టడంతో పాటు అవసరమనుకుంటే తనపై కూడా కేసులు నమోదు చేస్తారని ఎద్దేవా చేశారు. అధికారం వారి చేతుల్లో వుంది కాబట్టి ఏదైనా చేయడానికి సమర్థులని, ప్లాట్లు అమ్మిన యజమానికి ఆ లేఅవుట్‌తో ఏం సంబంధం ఉంటుందన్నారు. సోషల్ మీడియాలో వచ్చిన వీడియోలు చూస్తుంటే సిగ్గు కలిగించేలా ఉన్నాయన్నారు. గత ఐదేళ్ల పాలనలో ఎప్పుడూ ఇలాంటి వాటికి తావునివ్వలేదని గుర్తు చేశారు. మండపేట చరిత్రలో ఈ ఘటన మాయని మచ్చగా గుర్తుండి పోతుందన్నారు. పట్టణ నడిబొడ్డున ఇటువంటి పార్టీలు జరుగుతుంటే పోలీసుల కంటపడక పోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. అధికార పార్టీ అండ లేకుండా ఆ రోజు పార్టీ జరుగుతుందా అని అనుమానం వ్యక్తం చేశారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	12,000 – 12,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	17,500
గటగట (వెయ్యి)	16,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	16,800
గటగట (వెయ్యి)	15,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	14,500 – 15,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,500 – 14,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

యువకుడి దుర్మరణం

దేవరపల్లి: మండలంలోని బందపురం వద్ద గుండుగొలను–కొవ్వూరు జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందగా మరో యువకుడు తీవ్రంగా గాయపడి రాజమహేంద్రవరం ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసుల కథనం ప్రకారం విజయవాడ రూరల్ మండలం కానూరుకు చెందిన జక్కం సుశీల్ తేజస్, పాత్రు లోకేష్ విజయవాడ నుంచి రాజమహేంద్రవరం మోటార్ సైకిల్‌పై వస్తుండగా బందపురం వద్ద హైవేపై మోటార్ సైకిల్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో పల్సర్ మోటార్ సైకిల్ వెనుక వైపున కూర్చున్న జక్కం సునీల్ తేజస్ (21) తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మోటార్ సైకిల్ నడుపుతున్న లోకేష్ తీవ్రంగా గాయపడగా చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. మోటార్ సైకిల్‌ను వేగంగా నడపడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్టు ఎస్సై వి.సుబ్రహమణ్యం తెలిపారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

యువకుడి మృతి


భరత్‌చంద్ర (ఫైల్)

రాజానగరం: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బంధువును చూసేందుకు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదానికి గురై ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. స్థానిక గైట్ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో శుక్రవారం ఈ ప్రమాదం జరిగింది. పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న రాజమహేంద్రవరం రూరల్ మండలం తొర్రేడుకు చెందిన మంగం భరత్‌చంద్ర (20) కాకినాడలోని ఒక ఆస్పత్రిలో ఉన్న బంధువును చూసేందుకు మిత్రుడు గొల్లపల్లి నాగేంద్ర (29)తో కలిసి గురువారం రాత్రి బైకుపై వెళ్లాడు. తెల్లవారుజామున తిరిగి వస్తుండగా ప్రమాదానికి గురయ్యారు. ముందు వెళ్తున్న లారీని అధిగమించే ప్రయత్నంలో బైకు హేండిల్ లారీ కి తగులుకొని, ఆ లారీ వెనుక చక్రంలో పడి భరత్‌చంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. నాగేంద్ర గాయాలతో బయటపడ్డాడు. కేసును రాజానగరం ఎస్సై నాగార్జున దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో..

పెదపూడి: లారీని మోటార్‌బైక్ ఢీకొట్టిన ఘటనలో ఫిజియో థెరపీ విద్యార్థి మృతిచెందాడు. మరో విద్యార్థి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అనపర్తి అడిషనల్ ఎస్సై బి.దుర్గాప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం పక్కిలంకకు చెందిన మానుకొండ చందు, పశ్చిమగోదావరి జిల్లా ద్వారకాతిరుమల మండలం కొమరి గ్రామానికి చెందిన పుచ్చకాయల నవనీత్(22) కరప మండలంలోని సిమ్స్ కాలేజీలో ఫిజియో థెరపీ చదువుతున్నారు. వారు కాలేజీకి వెళ్లడానికి మోటార్ బైక్‌పై ఈ నెల 2వ తేదీ బయలు దేరారు. రాత్రి 11 గంటల సమయంలో అనపర్తి మండలం పులుగుర బ్రిడ్జి వద్దకు వచ్చే సరికి ట్రాలీ లారీ డ్రైవర్ సిగ్నల్ సూచించకుండా లారీని ఒక్కసారిగా రోడ్డుపై నిలిపివేశాడు. వెనుక వస్తున్న నవనీత్, చందు లారీని వెనుక నుంచి మోటార్ బైక్‌తో ఢీకొట్టారు. ఈ ప్ర మాదంలో నవనీత్ తలకు బలమైన గాయమైంది. చందు కాలుకు గాయమైంది. వారిని రామచంద్రపురం ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే నవనీత్ మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మెరుగైన వైద్యం కోసం చందును కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. బాధితుడు చందు ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దుర్గాప్రసాద్ తెలిపారు.